# అలనాటి కోరిక

సీతమ్మ

నేను మాఊరు ఎలిమెంటరీ స్కూల్లో చదువుకొంటూ వుండేదాన్ని. నాకప్పుడు సుమారు ఏడు సంవత్సరాల వయస్సుండ వచ్చు. మా అయ్యవారమ్మ శిక్షణమాహాత్మ్యమో, లేక పూర్వజన్మవాసనేనో ఏదో మాత్రం చెప్పలేను గాని ఆ లేతవయస్సులోనే నా చిన్న మెదడులోనూ, హృదయంలోనూగూడా నేనూ ఒక కథకురాల్ని కావలెననే కోరిక అంకురించింది. కథలు వ్రాయడమంటే మాటలా? నలుగురూ తలలూచేటట్లు వ్రాయడం మహా మహా వాళ్లకే సందర్భపడకపోతూవుంటే నేనెంత, నా యోగ్యత యెంత-నేను కథలు వ్రాయడమేమిటని సంకోచంకూడా ఆ తోడుతనే పొటమరించింది. పొటమరించినట్టుగానే పొటమరించి ఆ సంకోచం నీటిబుడగవలె క్షణంలో మాయమై పోయింది. చూదాం, ప్రయత్నించి చూదాం. సరదాకు సరదాగానూ ఉంటుంది, అలవాటుకు అలవాటూ అవుతుంది. ఇప్పుడు వ్రాస్తూండేవాళ్లు మాత్రం ఒకటేసారి ఆకాశంనుంచి ఊడిపడినారా యేం? యత్నించి చూడడంలో తప్పేముంది గనక? అన్నీ కలిసివచ్చి, సందర్భాలు అనుకూలపడి వ్రాసినవి నా మనస్సుకు తృప్తికరంగావుండి ఫరవాలేదన్న ధైర్యంగలిగి పుస్తకరూపంగా అచ్చుపడినాయంటే నా కోరిక సఫలమూ అవుతుంది; ఏ నాలుగు కాసులకో ఎట్లాగో ప్రాప్తీ కలుగుతుంది. పుస్తకరూపంగా కాకపోయినా ఏ పత్రికలోనైనా ప్రకటించి నాలుగు కాసులు సంపాయించుకోవచ్చు. విజ్ఞానం మాట యెట్లావున్నా నీడపట్టునే ఇంట్లోనే కూర్చొని భర్తగారి సంపాదనకు మరికొంత జమా కలపవచ్చును. స్త్రీలు ఈ నూతన పరిశ్రమను ఎందువల్ల అవలంబించ గూడదు? హిందూయువతుల ధర్మానికేం వ్యతిరేకమా? అన్న యోచనలు ఒకటిపై ఒకటి తోస్తూ వచ్చి ఊరట చెందినాను. నా సంకల్పమే గనక కొనసాగే టట్లయితే నేను ప్రతి నిత్యమూ పొద్దస్తమానం చూస్తూవచ్చిన అమాయకపు పల్లెటూరుజనాన్ని, పల్లెటూరు జీవనాన్ని గురించిన కథలే వ్రాయవలెనని కూడా నిర్ణయం చేసుకొన్నాను.

రోజులు దాటిపోతున్నాయి. నేను ఏదో క్లాసు ప్యాసయినాను. ఆవూరి చదువంకతో అయిపోయింది. ఏ పట్నవాసమో చేరుకొని ఇంకా పైపైన చదువుదామని నాకేమో అప్పుడుండింది. 'నిబీదతనంచేతనూ 'ఎందుకామాల చదువింకా! ఇంత చాలు మనకు. ఏం భారీ ఉద్యోగాలు చేయబోవాలి! కావలిస్తే ఇంట్లోనే అదీ యిదీ తెలుగు పుస్తకాలు చదువుకోవచ్చులే.' అన్న ఉదాసీనం చేతనూ మా అమ్మా, మా నాయనా కూడా అం

దుకు సమ్మతించలేదు. నాకేమో రాత్రీ పగలూ అదే కలవరింత. అయితే మాత్రం నే నేం చెయ్యగలను?

మొదట్లో వాళ్లమీాదనాకు పట్టరానంత ఆగ్రహం వచ్చింది కాని అదీ ఒకందుకు మంచికే యేర్పడ్డదని యిప్పుడిప్పుడే గ్రహిం పగలిగినాను ఇంకా పైచదువులు చదివి ఉండినానంటే ఆదర్శాలకు, షోకులకు, నాగ రికతలకు అలవాటు పడిపోయి నా ప్రాణపద మైన, ఆనందస్వరూపమైనగ్రామజీవితంమీాద అసహ్యమే కలిగివుండేది.

మా దేమంత భారీకుటుంబం కాకపోవడం చేత ఇంటిపనులన్నీ మేమే చక్కబెట్టుకో వలసివచ్చేది. అటువంటి విషయాల్లో మా అమ్మకు నా సహాయం ఎంతైనా అవసరముం డేది. నాకూ పనిపాటలు చేసుకోవడమంటే చాలా సరదా. చదువుమీాది అభిలాషకొద్దీ విరామం దొరికినప్పుడల్లా వృథాపుచ్చ కుండా చదువుకొంటూ వుండేదాన్ని; బాల్య సంకల్పానికి దోహదాలు చేసుకొంటూవుండే దాన్ని. ఇరుగింటిబిడ్డలూ పొరుగింటి బిడ్డలూ వచ్చి 'అత్తా, అత్తా నాకు లత-తల-వలలు నేర్పవూ' అంటూ తొందరచేసేవాళ్లు. విసుగు లేకుండా బహుసంతోషంతో నేర్పుతూవుండే దాన్ని.

యుక్తవయస్సురాగానే నాకు వివాహం చేశారు. మా అత్తవారిదీ పల్లెటూరే. నాభర్త ఉన్ననాలుగెకరాల మాగాణీ సొంత సేద్యంచేసుకొంటూ సుఖంగా కాలక్షేపం చేస్తూండేవారు. ధర్మేచ, అర్థేచ, కామేచ అతిచరించనంటూ మెలగే హిందూయువతిని కాబట్టి నాకూ ఆయనతోడిదే లోకం అయి పోయింది. ఆయనకష్టసుఖాలలో నేనూ భాగం వహించేదాన్ని. చిలకాగోరింకల్లాగు ఎంతో ముచ్చటగా వుండేవాళ్లం మేమిద్దర మూను.

కాని యీ సందడిలో నావ్యాసంగమం తగా సాగడం తప్పిపోయింది. అయితేనేమి, పనులన్నీ ముగించుకొని, రాత్రి అందరూ నిద్రపోయినతరువాతనన్నా సాధ్యమైనంతమ ట్టుకుతప్పకుండా చదువుకొంటూ వుండేదాన్ని. ధర్మలోప భయం లేకుండా మెలగుతూవుండ డాన్నిబట్టి నాభర్తగారు నా చదువుకేమీ ఆక్షేపణ చెప్పలేదు. అప్పుడప్పుడు ఏవో పిచ్చికథలు తోచినట్లు వ్రాసుకొంటూ అసం తృప్తిగా నేనే చించి పారవేస్తూవుండేదాన్ని. అప్పటికి సాధించిందేమీ లేకపోయినా వ్రాత అలవాటవుతూవుండేది. ఈ ప్రయత్నమేమీ కావ్యసృష్టికి కాదుగనుక త్వరలోనే సంకల్పం సిద్ధించే లక్షణాలు తోచాయి.

మా యింటికిదగ్గరగానే ఒకతోట వేసు కొన్నాం. కూరగాయలూ, పూలమొక్కలూ అందులో వేసుకొన్నాం. ఇంట్లో పాడిపశు వులు, గొడ్డుగోదములు. ఈ అన్నీ చక్క బెట్టుకోవడంతో ఉదయం నాలుగ్గంటలు మొదలు రాత్రి పదింటిదాకా నాకొకేపనిగా వుండేది. అన్ని కష్టాల్లోకూడా నే నానందమే అనుభవించేదాన్ని. నా భర్తగారు కూడా

తమపనులన్నీ సర్దుకొని నాకూ సహాయపడుతూవుండేవారు. ఉన్నమట్టుకు ఇల్లూ, ఇంటిలోని వస్తువులూ మట్టసంగా పెట్టుకొని అనుకూలాలు చేసుకొంటూవుండేదాన్ని.

ఈవిధంగా ఒకటి రెండేండ్లు గడచిపోయినాయి ఏవిధమైన విచారమూ లేకుండా సంసారం చక్కబెట్టుకొంటూవచ్చాను. ఇది యిలా వుండగా మా యింట్లో ఒక చిన్న పాప అవతరించడానికి ఉపక్రమించుకొన్నది.

బిడ్డలంటే నా భర్తగారికి కెంతో ప్రీతి. ఆయన విచారించేదల్లా నా ఆరోగ్యాన్ని గురించే. ఈ కొత్తపరిస్థితికి ఆయన పరమానందపడినారు.

అన్నవస్త్రాలకు లోటులేదు. వ్యసనాలు లేవు. అభిమానంగల భర్త. అన్నీ అనుకూలపడి నాజీవితం బ్రహ్మానందంగా పరిణమించింది. కమలపుట్టి దాన్ని మరింత వృద్ధి చేసింది.

ధాన్యంధరలు బాగనే ఉన్నాయి. మాకు పంటకూడా బాగానేపండింది. అప్పుడప్పుడు చేస్తూవచ్చిన బాకీలు తీర్చుకొన్నాం. అందరికీ ఆరోగ్యం సలక్షణంగా ఉంది. చిన్నకూన కమలకూడా అల్లారుముద్దుగా ఆడుకొంటూవుంది. అన్నీ బాగానే ఉన్నాయి.

ఉన్నదున్నట్టు కాలం వక్రించిపోయింది. కానిరోజులు వచ్చి పడినాయి. పంటయేమో ఇంకా బాగానే వచ్చిందిగాని ధరలే సగానికి సగం పడిపోయినాయి. ఇంటిబాకీలు బాకీలుగానే నిలిచిపోయినాయి. శిస్తులకు, కూలీలకే సమ్మసరిపోయింది రాబడి. అన్నవస్త్రాలకు తృణంగూడా మిగలలేదు. గుడ్డలేమో పాతవాటినే చిరుగులు కుట్టుకొని సర్దుకొన్నాం.

అంతలో మరింత చురుకుపుట్టింది. ఇబ్బడిగా శ్రమించడానికి పూనుకొన్నాం. ఇంటిపనులు, తోటపనులలోనే ఉన్నదాన్ని వ్యవసాయపు పనుల్లోకూడ భర్తగారికి తోడుపోతూవచ్చాను. ఈ సారయినా ముందటియేడు లోటు భర్తీచేయవలెనని సకలప్రయత్నాలు చేస్తూన్నాం. పంటైనా రెండింతలుగా వస్తే అన్నీసర్దుకొని పోవచ్చునని ఆశ. అన్నిసూఖాలూ వదలుకొని ఒకే ధాటిగా పాటుపడడానికి పూనుకొన్నాను.

అటువంటి పరిస్థితులలోని కష్టాలు అనుభవించినవారికేగాని తెలియవు. కాని నాకొక్కర్తెకే కాదు; ఇరుగుపొరుగువారి కందరికీ గూడా ఇదే అనుభవం.

వేకువజామున లేవడం, పశువులకు నీరు పెట్టడం, పాలు పిండుకోవడం, మజ్జిగ చిలకడం, ఇంటి కసవూడ్చుకోవడం, పాచిపనులు చేసుకోవడం, స్నానంచేసి వంట వార్చడం, భోజనం చేయడం, తోటాపొలాలూ చూచుకొనివచ్చి గుడ్డలు ఉతికి ఆరవేసుకొని నీళ్లు తోడిపెట్టుకోవడం, వంట సామగ్రి చక్కబెట్టుకోవడం, తోటలో కాయగూరలు-పూలు కోసుకొని రావడం, సందెకసవు ఊడ్చడం, పశువులను కట్టివేసి మేతా నీళ్లూ పెట్టడం, పాలు పిండుకోవడం,

మళ్లా వంటకుపక్రమించి భోజనం చేయడం, మరుసటి రాటికి కావలసినవన్నీ సర్దుకోవడం, పడకలు వేయడం, ఈ మర్య మధ్య బిడ్డను ఆడించుకోవడం మొదలైన పనులతో క్షణం విరామంలేకుండా కార్యక్రమం సాగిపోతూ వుండేది. రాత్రిపూట ఏ అయిదారుగంటలలో తప్ప విశ్రాంతే దొరకేదికాదు. అప్పుడూ కొంతసేపు చదువు.

ఇంత అవస్థపడినా జీవనం సక్రమంగా జరిగే ఉపాయం కనుపించలేదు. పంటల మాట యెట్లావున్నా ధరలు మాత్రం పడి పోయినవి పడిపోయినట్టుగానే ఉన్నాయి. రోజులు గడపడం బహు దుర్భరమైపోయింది. అయినా మేము లెక్కచేయులేదు.

మేమన్నా ఎంతో మేలు, సగం కడుపు కన్నా తినగలుగుతున్నాం; ఇల్లూ వాకిలీ ఉన్నది అంతమాత్రానికీ నోచుకొని చుట్టు పక్కలవాండ్లను చూస్తూవుంటే వారి అవ స్థలముందు మావి అవస్థలే అనిపించేవికావు.

ఇట్టి స్థితిలోకూడా, దైవబలం కాక పోతే మరేమి, బాకీదార్లు తొందరచేయడం లేదు. ఇచ్చిన తృణమోపణమో పుచ్చుకొని తర్వాతనే ఆములెండిఅంటూ సమాధానంగా పోయేవారు.

ఎన్నిరోజులన్నా యిలాగే గడుస్తూవుం డేటప్పటికి కొంచెం కష్టం తోచినట్టయింది. ఇల్లు మరమ్మతు చేసుకోవడంకూడా సాకర్య పడలేదు. వ్యవసాయపు పనిముట్లు పాతపడి చివికిపోయినాయిగాని కొత్తవాటిని కొను క్కోవడానికి సందర్భపడలేదు. అన్నట్టు చెప్ప మరిచినాను, రెండవ సంతతికూడా కలిగింది. ఆ బిడ్డలకు కావలసిన వస్తువులకు కూడా మార్గం లేదు. ఖర్చులేమో రోజుకు రోజుకు బలిసిపోతున్నాయి.

పోనీ, చిల్లరపనులేమన్నా చేసుకొని అదనపు ఆదాయానికి మార్గంచూతామంటే అటువంటి వేమీ స్ఫురించలేదు. పూలూ, కాయగూరలూ అమ్ముకొంటే మాత్రం ఎంత వస్తుంది? కూలిపెట్టి సమీపంలో వుండే సంతలకు పంపితేమట్టుకు బండిబాడుగలు, కూలీలు సర్దుకొనిపోయేటట్లు రాబడి వస్తేనే బ్రహ్మప్రళయ మైపోయేది.

* * * *

కాలచక్రం గిర్రున తిరుగుతూ వుం టుంది కాబోలు, మళ్లా మంచిరోజులు వచ్చి నాయి. కష్టాలు కాపురం ఉండ వంటారు, ఇదే కాబోలు! ధరలు మామూలు స్థితికి వచ్చినాయి. ఊరందరితోపాటు మేమూ అమితంగా సంతోషించినాము. ఇలువేల్పుకు మొక్కులు సహా చెల్లించాము. తిరిగీ మొదటి సుఖజీవనంలో పడినాము. పసికూన లకు కావలసినన్ని వస్తువులు సమకూర్చి నాము; మేమూ సమకూర్చుకొన్నాము. ఇల్లు మరమ్మతు చేసుకొని అందంగా తీర్చు కొన్నాము. బాకీలు తీర్చుకొన్నాము.

కష్టములంటే యేమిటో, సంసారంలో యేర్పడే చిక్కులేమిటో, ధనం లేకపోతే

వచ్చే యిబ్బందు లెట్టివో నా అనుభవాన్ని బట్టి చక్కగా గ్రహించగలిగినాను. కాని రోజులు అనుభవించినాను గాబట్టి జీవన సౌందర్యాన్ని అప్పుడే అనుభవింపగలిగినాను. కష్టసుఖాల తారతమ్యం తెలిసి వచ్చింది. అనుభవపాఠాలు నేర్చుకొన్నాను.

మళ్లా నా జీవితంలో ఒకటి రెండుసార్లు ఇటువంటి ఎగుడుదిగుడు లే సంభవించినాయి. అప్పటికి నాకు మరియిద్దరు సంతానం కలిగి యుండడం మూలాన్న మొదటిసారికన్న పెక్కింతలు ఆజీవితం కష్టంగా అగుపించింది గాని ఒకసారి అనుభవించినదాన్ని గావున సమాళించుకొంటూవచ్చాను. నా భర్తగారు కూడపిల్లలమీదనుండే ఎనలేని మమతతో కన్న కష్టాలుపడుతూ వాండ్లసౌఖ్యానికై ప్రయత్నపడుతూవుండేవారు.

ఇన్నికష్టాలలోకూడా ఆనందాన్ని, హాయినిగూర్చిన నాపల్లెటూరు జీవనాన్ని గురించి, ఆ సౌందర్యాన్ని గురించి తరుచు మిత్రురాండ్రతో ప్రసంగం చేసుకొంటూ మురుస్తూవుంటాను. ఆసంభాషణల సారాంశమే యీ కథ. నాచిరవాంఛితం యిప్పటికైనా యీ రీతిగానైనా తీర్చుకోగలిగితిని గదా యని అమిత సంతోషమవుతూంది.

ఇదేం గొప్పకథ అని గాదు ప్రకటించుకోవడం. నేను గడపిన సామాన్య జీవనాన్ని, అందు లోని అందాన్ని ప్రపంచంలో నాతోటివారు పడే అవస్థలను వ్యక్తము చేయడానికీ, నా చిన్ననాటి సరదాను ఎలా పోషించుకొంటూవచ్చి కృతకృత్యురాల్ని అయానో తెలుపడానికీ మాత్రమే యిది వ్రాశాను. నా చదువుకులాంగానే ఈవ్రాతకుగూడా రాత్రిపూటే విశ్రాంతిదొరికి వ్రాసినాను చదువరులు ఈకథకు సంతోషించినా సంతోషించకపోయినా ఆనాటికోరికను నెగ్గించుకోగలిగితిని గదా అని లోలోపలే మురిసిపోతున్నాను. ఇలాంటివే యింకా వ్రాస్తూవుంటే ఇప్పుడు గాకపోయినా మరొకప్పుడైనా నా కథలూ జాతిరత్నాలే అవుతాయి. చూస్తూవుండండి.

---